నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 12 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



అర్జున్‌రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దివాకర్‌రావు



కౌటాల : కౌటాలలో రెండు కిలో మీటర్ల మేర నిలిచిన పత్తి వాహనాలు

# అర్జున్‌రావు సేవలు మరువలేనివి

**మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు**

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 11 : స్వాతంత్ర్య సమరయోధుడు, మంచిర్యాల మున్సిపల్ తొలి చైర్మన్ ముత్తినేని అర్జున్‌రావు సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. అర్జున్‌రావు ఎనిమిదో వర్ధంతి సందర్భంగా మంగళవారం మంచిర్యాలలోని మెయిన్‌రోడ్‌లో గల ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికోసం అర్జున్‌రావు ఎంతగానో కృషిచేశారని, రాజకీయ నాయకునిగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అర్జున్‌రావు కూతుళ్లు, ఐసీడీఎస్ మాజీ ఆర్వో అత్తి సరోజ, హేమలత, కుమారులు రవికుమార్, మోహన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు విజిత్‌రావు, పల్లె భూమేశ్, మాజీ వైస్‌చైర్మన్ ముఖేశ్‌గౌడ్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మా భూమిలో పీహెచ్‌సీ నిర్మించవద్దు

కన్నెపల్లి, ఫిబ్రవరి 11 : గొల్లగట్టు శివారులోని సర్వే నంబరు 73లో గల భూమిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించి తమ పొట్ట కొట్టవద్దని అదే గ్రామానికి చెందిన నెండుగూరి బాపు, మల్లేశ్, రాజన్న పేర్కొన్నారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆ స్థలంలో పీహెచ్‌సీ నిర్మించవద్దంటూ ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ తమకు పాత పట్టాలు ఉన్నాయని, తమ గ్రామానికి చెందిన కొందరు భూమిని ఆక్రమించే ప్రయత్నం చేయడంతో కోర్టుకు వెళ్లామన్నారు. కోర్టులో కేసు ఉండగా ఆ భూమిలో పీహెచ్‌సీ నిర్మాణం ఎలా చేపడుతారని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గంగారాం అక్కడికి చేరుకొని న్యాయం కోసం రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. దీంతో వారు ధర్నా విరమించి వెళ్లిపోయారు.



ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్‌ఐ



చెన్నూర్-మంచిర్యాల జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు, మద్దతు తెలుపుతున్న మాజీ ఎంపీపీ మంత్రి బాపు, నాయకులు

# కర్షకుల కన్నెర్ర

**నాలుగు రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆగ్రహం**

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా
- కిష్టంపేటలోనూ రోడ్డెక్కిన రైతులు
- రెండు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : నాలుగు రోజులుగా పత్తి కొనుగోళ్లు చేపట్టకపోవడంపై రైతులు కన్నెర్ర చేశారు. ఈ మేరకు మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. రైతులు మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు నిలిపివేయడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయని, వాటి చార్జీల భారం తమపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సీసీఐ స్పందించి ఎప్పటికప్పుడు కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం దినకర్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పత్తిని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నదన్నారు. జిన్నింగ్ మిల్లులో రోజుకు 1500 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, ఆ నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులతో కలిసి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.



ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పత్తి రైతులు

### సర్వర్ సమస్య వల్లే కొనుగోలు చేయడం లేదు

సర్వర్ సమస్య కారణంగానే పత్తి కొనుగోళ్లు రెండు రోజులుగా నిలిచిపోయినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ హైమద్ తెలిపారు. పత్తి కొనుగోళ్లలో ఆధార్ ప్రామాణికత ముఖ్యమైందని, అయితే సర్వర్ సమస్యల కారణంగా పత్తి రైతులు తీసుకువచ్చే ఆధార్ అథెంటికేషన్ కావడం లేదన్నారు. సర్వర్ సమస్య తీరిన వెంటనే కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించే వరకూ రైతులు పత్తిని తీసుకురావద్దని సూచించారు.

### రెండు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

కౌటాల, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని శ్రీ వైష్ణవీ మాత కాటన్ ఇండస్ట్రీస్‌లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. సోమవారం నుంచి సర్వర్ సమస్యతో పత్తి కొనుగోళ్లకు బ్రేక్ పడగా, మిల్లు వద్ద రెండు కిలో మీటర్ల మేర పత్తి వాహనాలు నిలిచిపోయాయి. వాహనాలు, డ్రైవర్ల కిరాయి భారం తమపై పడుతుందని, వెంటనే పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, కొందరు గత్యంతరం లేక ఎంతో కొంతకు ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని అమ్ముకొని వెనుదిరుగుతున్నారు.

### కిష్టంపేటలో రోడ్డెక్కిన కర్షకులు

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 11: మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామ సమీపంలోని వరలక్ష్మీ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. మూడు రోజులుగా పత్తి వాహనాలతో ఇక్కడే ఉండాల్సి వస్తున్నదని, సీసీఐ అధికారులు ఆన్‌లైన్ పని చేయడం లేదంటూ నిర్లక్ష్యపు సమాధానమిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. మాజీ ఎంపీపీ మంత్రి బాపు మాట్లాడుతూ దళారులు-సీసీఐ అధికారులు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని, నిత్యం రోడ్డెక్కాల్సి వస్తున్నదని, ఈ విషయమై ఉన్నధికారులు స్పందించకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి రెండు గంటల పాటు ధర్నా చేయడంతో రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మార్కెట్ సెక్రటరీ రామాంజనేయులు, పట్టణ సీఐ రవీందర్, ఎస్‌ఐ సుబ్బారావు, సీపీవో అక్కడికి చేరుకొని ఆన్‌లైన్ రాగానే పత్తి కొనుగోళ్లు చేపడుతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. చెన్నూర్ మాజీ కౌన్సిలర్ మహేశ్, కిష్టంపేట సర్పంచ్ బుర్ర రాకేశ్ గౌడ్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లోని జిన్నింగ్ మిల్లు వద్ద నిలిచిపోయిన పత్తి వాహనాలు




# పల్లె పోరుకు రెడీ

**మంచిర్యాల జిల్లాలోని 306 పంచాయతీలకు విడుతల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధం**

- ఇప్పటికే రిటర్నింగ్ అధికారుల నియామకం
- నియోజకవర్గాల వారీగా సిబ్బందికి కొనసాగుతున్న శిక్షణ
- రెండు దఫాల్లోనే ఎలక్షన్స్ పూర్తి చేసే యోచన!

హాజీపూర్, ఫిబ్రవరి 11 : జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల్లో విడుతల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ మేరకు స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు, అస్టిటెంట్ రిటర్నింగ్ అధికారులు, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులు, పీవోలు, ఓపీవోలను నియమించింది. ప్రస్తుతం వీరికి కలెక్టరేట్‌లో శిక్షణ ఇస్తున్నది. మంగళవారం మంచిర్యాల నియోజకవర్గానికి కేటాయించిన అధికారులకు ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇవ్వగా, బుధవారం ఉదయం బెల్లంపల్లి నియోజకవర్గం, మధ్యాహ్నం చెన్నూర్ నియోజకవర్గాలకు కేటాయించిన ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 10 గంటల నుంచి చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, కోటపల్లి, జైపూర్, భీమారం, మందమర్రి మండలాలకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, వేమనపల్లి, భీమిని, కన్నెపెల్లి, నెన్నెల మండలాలకు చెందిన రిటర్నింగ్ అధికారులు, అస్టిటెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు, స్టేజ్-1, స్టేజ్-2 అధికారులకు ఎన్నికల నియమావళి, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ విధానం తదితర అంశాలపై సమగ్రంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇక పీవోలు, ఓపీవోలకు ఈనెల 15వ తేదీలోగా మండల స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది.



శిక్షణలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారులు

### రెండు విడుతల్లోనే..

జిల్లాలో మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అధికారులు ప్రతిపాదించినప్పటికీ రెండు విడుతల్లోనే పూర్తి చేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది.

జిల్లాలోని 306 పంచాయతీలకు 101 క్లస్టర్లు విభజించారు. ఒక్కో క్లస్టర్‌కు ఇద్దరు అధికారులను నియమించారు. వారికి అదనంగా మరికొంత మందిని నియమించి శిక్షణ ఇస్తున్నారు. ఒక ప్రాంతానికి చెందిన అధికారులను మరో ప్రాంతానికి కూడా కేటాయించనున్నారు. స్టేజ్-1 అధికారులకు సహాయంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, స్టేజ్-2 అధికారులను నియమించారు.

### ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

**- వెంకటేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి, మంచిర్యాల**

ప్రభుత్వం జీపీలకు ఎన్నికలు నిర్వహించాలని ఎప్పుడు ఆదేశించినా సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎన్నికల సామగ్రిని మండల కేంద్రాలకు పంపించాం. స్టేజ్-1, స్టేజ్-2, అస్టిటెంట్ రిటర్నింగ్ అధికారుల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తిచేశాం.

**ఎన్నికల సిబ్బంది వివరాలు**

| వివరం | సంఖ్య |
|---|---|
| జిల్లాలోని గ్రామ పంచాయతీలు | 306 |
| వార్డులు | 2,680 |
| మొత్తం ఓటర్లు | 3,76,853 |
| పోలింగ్ కేంద్రాలు | 2,680 |
| బ్యాలెట్ పెట్టెలు | 3,777 |
| స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు | 101 |
| స్టేజ్-1 సహాయ రిటర్నింగ్ అధికారులు | 101 |
| స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులు (రిజర్వ్‌లో ఉన్న వారితో కలిపి ) | 340 |
| పోలింగ్ సిబ్బంది | 4,620 |



సిద్ధంగా ఉన్న ఎన్నికల సామగ్రి




# ఒక్కో కార్యకర్త వందమందితో సమానం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే పట్టం
- కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలి
- అక్రమ కేసులకు భయపడేది లేదు
- మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు
- లక్సెట్టిపేటలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం

లక్సెట్టిపేట, ఫిబ్రవరి 11 : ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న ఒక్కో కార్యకర్త వంద మందితో సమానమని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కే.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కడుతారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలమైందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నడిపెల్లి విజిత్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, అంకతి గంగాధర్, మైనార్టీ నాయకులు చాంద్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఉప సర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ వైస్ ఎంపీపీలు, మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులుక కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



## అక్రమ కేసులకు భయపడేది లేదు

**మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు**

హాజీపూర్, ఫిబ్రవరి 11 : బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో హాజీపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నదని, అందులో భాగంగానే అక్రమ కేసులు పెడుతున్నదన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఏ ఇబ్బంది కలిగినా బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కడుతారని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజిత్ రావు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

